క్లుప్తంగా

మరిడమ్మ ఆలయం వద్ద అన్నదానం

సామర్లకోట: పెద్దాపురంలో కొలువైన మరిడమ్మ తల్లి జాతర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని మంగళవారం భారీ ఎత్తున భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో వారికి డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు తదితరులు పాల్గొన్నారు. పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

పొలంబడిపై అవగాహన కల్పించాలి



కొత్తపల్లిలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారి జోగిరాజు

కొత్తపల్లి: పొలంబడిపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత వీఏఏ, వీహెచ్ఏలదేనని మండల వ్యవసాయ అధికారి జోగిరాజు తెలిపారు. స్థానికంగా ఉన్న గంధం కృష్ణ పొలంలో మంగళవారం పొలంబడిపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంబడి ముఖ్య ఉద్దేశం రైతులకు చేకూరే లబ్ధిపై అవగాహన కల్పించడమేనన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై రైతులు దృష్టి సారించాలన్నారు. రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులందరికీ పొలంబడి ద్వారా వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం అందించాలని గ్రామస్థాయి సిబ్బందికి సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, పురుగు మందులు ఉపయోగించాలన్నారు. గడ్డి మందులను అధికంగా ఉపయోగించవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ పట్టణ విస్తృత స్థాయి సమావేశం

సామర్లకోట: వైఎస్సార్ సీపీ పట్టణ విస్తృత స్థాయి సమావేశం బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక గాంధీచౌక్‌లోని రైతు భవనంలో ప్రారంభం అవుతుందని పట్టణ పార్టీ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు బొందపు వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని వారు తెలిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు పిలుపు నిచ్చారు.

రిజర్వేషన్లపై అవగాహన పెంచుకోవాలి

సామర్లకోట: ఎస్సీలకు కేటాయించిన రిజర్వేషన్ అంతా మాల సామాజిక వర్గమే తినేస్తోందని అనేక రాజకీయ పార్టీలు, కొన్ని వర్గాల దుష్ప్రచారమని రాక్స్ అండ్ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. మంగళవారం పెద్దాపురంలో విలేకర్ల సమావేశం లో ఆయన పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాలలో మాదిగల కన్నా మాలలు ఒక అడుగు ముందున్న మాట వాస్తవమేనన్నారు. దీనిని బూచిగా చూపించి, దేశం మొత్తాన్ని వదిలేసి, కొన్ని వర్గాలు, రాజకీయ పార్టీలు మాలలను లక్ష్యంగా చేసుకుని తొక్కేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వర్గీకరణ ముసుగులో ఎస్సీలను ముక్కలు చేసి, ఎప్పటికీ రాజ్యాధికారం వైపు కన్నెత్తి చూడకుండా బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. ఎస్సీలను వర్గీకరించే చట్టాలను వెనక్కు తీసుకునేంత వరకు నిరంతరం శాంతి పోరాటం కొనసాగుతుందని రత్నాకర్ తెలిపారు.

వివిధ కార్యక్రమాలకు రూ.11.3 లక్షల విరాళం

కాకినాడ సిటీ: వచ్చే నెలలో నిర్వహించనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, హాకీ టోర్నమెంట్లకు మంగళవారం వివిధ ప్రైవేట్ సంస్థల నుంచి రూ.11.3 లక్షలు విరాళాలుగా అందాయని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. విరాళాలు అందజేసిన సంస్థల ప్రతినిధులు మంగళవారం కలెక్టరేట్‌లో చెక్కులు అందజేశారు.


పేదలను దత్తత తీసుకోవాలి



పీ4పై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ సతీష్, డిప్యూటీ ఎంపీడీఓ రామాంజనేయులు

కాకినాడ రూరల్: పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ (పి–4)లో భాగంగా ఉద్యోగులు పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారికి సహాయ సహకారాలు అందించాలని ఎంపీడీఓ ఎం.సతీష్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పీ4పై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఈ మేరకు అవగాహన కల్పించారు. పేద కుటుంబాలు ఆర్థిక ఎదుగుదల, వారి పిల్లలకు విద్య తదితర అంశాలపై సలహాలు ఇవ్వాలన్నారు. మండల స్థాయి అధికారులు రెండు కుటుంబాలు, గ్రామ స్థాయి అధికారులు ఒక్కో కుటుంబం చొప్పున దత్తత తీసుకోవాలని సూచించారు.

పచ్చంగ చూడమ్మా.. త్రిపురమ్మా



సామర్లకోటలోని పంచారామ క్షేత్రం



శాకంబరి అలంకరణకు కూరగాయల దండలు తయారు చేస్తున్న దీపారాధన సంఘ సభ్యులు



ఆలయంలో మామిడి తోరణాలు సిద్ధం చేస్తున్న కార్మికులు



సారెకు సిద్ధం చేసిన మిఠాయిలు

- పంచారామ క్షేత్రంలో నేడు పచ్చని పండుగ
- ఓవైపు శాకంబరిగా ఆకుపచ్చగా అలంకరణ..
- మరోవైపు లక్ష పసుపుకొమ్ములతో నోము
- నూకాలమ్మ ఆలయం నుంచి సారె ఊరేగింపు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో అమ్మవారిని బుధవారం శాకంబరిగా అలంకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా ఆషాఢంలో వచ్చే మాస శివరాత్రి రోజున ఆలయంలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారిని శాకంబరిగా అలంకరిస్తారు. దీనితో పాటు ఉప ఆలయాలలోని సరస్వతీదేవిని, మహిషాసురమర్ధిని అమ్మవార్లను, ఆలయాన్ని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరిస్తారు. భక్తులు సమకూర్చే కూరగాయలు సరిపోని పక్షంలో దేవస్థానం ఏర్పాటుచేసే కూరగాయలతో అలంకరిస్తారు. నంది మండపం వద్ద ఆలయ నమూనాను కూరగాయలతో అలంకరిస్తారు. ఈఓ బళ్ల నీలకంఠం పర్యవేక్షణలో ఆలయ దీపారాధన సంఘ సభ్యులు మంగళవారం సాయంత్రం నుంచి ఈ మేరకు ఏర్పాట్లు ప్రారంభించారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద అరటి చెట్లతో, మామిడి, వేప ఆకుల తోరణాలతో అలంకరిస్తారు.

నూకాలమ్మ ఆలయం నుంచి సారె ఊరేగింపు

స్థానిక స్టేషన్ సెంటర్‌లోని నూకాలమ్మ ఆలయం నుంచి బుధవారం పంచారామ క్షేత్రానికి సారె ఊరేగిస్తారు. భక్తుల నుంచి సేకరించిన పసుపు కొమ్ములు, చీర, జాకెట్టు ముక్కలు, గాజులు, పండ్లతో కోలాటం, బ్యాండ్ మేళం మధ్య ఊరేగింపు ప్రారంభమై గడియారం స్తంభం సెంటర్, రైల్వేస్టేషన్ సెంటర్, ఫ్లైఓవర్ బ్రిడ్జి, కెనాల్ రోడ్డు, కాలిబాట వంతెన, మాండవ్యనారాయణ స్వామి ఆలయం మీదుగా ఊరేగింపు ఆలయానికి చేరుతుంది. కాగా సారెకు సంబంధించి మిఠాయిలను మంగళవారం సాయంత్రానికే భక్తులు సిద్ధం చేశారు.

లక్ష పసుపు కొమ్ముల నోము

ఈ సందర్భంగా పంచారామ క్షేత్రంలో మొట్టమొదటి సారిగా లక్ష పసుపు కొమ్ముల నోము నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై ఎంపిక చేసిన దంపతులతో ఈ కార్యక్రమం చేయిస్తారు. అనంతరం భక్తులకు అమ్మవారి శాకంబరి అలంకరణ చేస్తారు.

పురాణ కథనం ఇదీ..



శూన్యమాసంగా భావించే ఆషాఢమాసంలో పూర్వం కరువు కాటకాలు సంభవించి ప్రజలు పంటలు, ఆహారం లేక ఇబ్బంది పడ్డారు. ఆ సమయంలో నారదుని సూచనలతో రుషులు తపస్సు చేసి జగజ్జననిని మెప్పిస్తారు. దీంతో ఆమె అనుగ్రహంతో పంటలు, కూరగాయలు, పండ్లు పుష్కలంగా పండి ప్రజలు సంతోషంగా ఉంటారు. అప్పటి నుంచీ ఏటా శక్తి దేవతలను శాకంబరిగా అలంకరించడం ఆనవాయితీగా మారింది.

– వేమూరి సోమేశ్వరశర్మ, పంచారామక్షేత్ర అభిషేక పండితుడు, సామర్లకోట

భక్తుల నుంచి కూరగాయలు, పసుపు కొమ్ములు...



శాకంబరి అలంకరణకు భక్తులు మొక్కుల కొలదీ కూరగాయలు అందజేస్తారు. దాతల నుంచి వచ్చిన కూరగాయలను బట్టి అవసరమైతే దేవస్థానం మరిన్ని కొనుగోలు చేస్తుంది. సుమారు 400 కేజీల కూరగాయలతో ఈ అలంకరణ ఉంటుంది. మొదటిసారిగా లక్ష పసుపు కొమ్ముల నోము ఏర్పాటు చేశాం.

– బళ్ల నీలకంఠం, ఈఓ, పంచారామ క్షేత్రం, సామర్లకోట

ముందస్తు సమాచారం లేకుండా రహదారి తవ్వకం



ఆలయ ముఖద్వారం వద్ద సాగుతున్న పైప్‌లైన్ నిర్మాణ పనులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రానికి వెళ్లే రహదారిని ముందస్తు సమాచారం లేకుండా తవ్వడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయం గోదావరి కాలువ అవలివైపు ఉంటుంది. దాంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కార్లు, బస్సులలో ఆలయానికి రావడానికి వీలుగా గోదావరి కాలువపై వంతెనలు నిర్మించారు. కాగా పంట కాలువలలోనికి గోదావరి నీరు వచ్చేందుకు వీలుగా పైపులు ఏర్పాటు చేసే పనుల్లో భాగంగా పంచారామ క్షేత్రం ముఖద్వారం వద్ద పొక్లెయిన్‌తో రహదారిని తవ్వారు. దీంతో ఆ మార్గం గుండా ఎటువంటి వాహనాలకు రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన పనులకు సంబంధించి ఉదయం నుంచే ఆలయానికి కార్లు ఇతర వాహనాలను ఆలయ ఆవరణ నుంచి తీయించడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో గోదావరి కాలువ ఇనుప వంతెన వద్దనే వాహనాలను నిలిపివేసి ఆలయానికి రావాల్సి వచ్చిందని భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులలో అనేక మంది వృద్ధులు ఆలయానికి చేరుకునే పరిస్థితి లేకపోయింది. ఈ రహదారి మరమ్మతులపై ముందస్తు ప్రచారం, ప్రకటనలు చేసి ఉంటే ఆలయానికి ప్రయాణాలు వాయిదా వేసుకునేవారమని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

పంచారామ క్షేత్రం ఈఓ బళ్ల నీలకంఠంను వివరణ కోరగా రైతు సంఘం అధ్వర్యంలో పంట కాలువకు పైపులైన్ పనులు చేస్తున్నారని, మంగళవారం రాత్రికే ఆ పనులు పూర్తయిపోయాయని తెలిపారు. భక్తుల రాకపోకలకు ఇబ్బంది లేదని పేర్కొన్నారు.

మెరుగైన సమాజం అందరి బాధ్యత

ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు



సమావేశంలో మాట్లాడిన ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు

సామర్లకోట: మెరుగైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. మిషన్ వాత్సల్య పథకంపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, స్కూల్ హెచ్ఎంలు మహిళా సంఘాల ప్రతినిధులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాలల హక్కుల రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాల్సి బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామాలలో బాల్య వివాహాలు జరిగిన సమయంలో ప్రజా ప్రతినిధులను ఆశ్రయించే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని మైనారిటీ తీరే వరకు వివాహాలు జరగకుండా చూడాలన్నారు. బాలికకు పెళ్లి చేస్తే పోక్సో చట్టం ప్రకారం శిక్ష తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. బాల్య వివాహాలు ఎక్కడైనా చేస్తున్నట్టు తెలిసే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు తెలియజేయాలని సూచించారు. పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జి.ఉష అధ్యక్షత వహిస్తూ బాలల చట్టాలపై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వివాహాలకు హాజరయ్యే సమయంలో వధూవరుల వయసు గమనించి వెళ్లాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారి వెంకట్ మాట్లాడుతూ దత్తత ప్రక్రియ, బాలల సంక్షేమం, రక్షణ కమిటీలు ఎలా పని చేయాలో వివరించారు. మధ్యలో చదువు మానేసిన వారి కోసం నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్‌కు వెళ్లే వారికి రూ.రెండు వేలు ఆర్థిక సాయం, రవాణా చార్జీలు చెల్లిస్తారని తెలిపారు. బాలలను వేధిస్తే పోక్సో చట్టం ఏ విధంగా పనిచేస్తుందో మరో అధికారి బి.శ్రీనివాసరావు వివరించారు. క్లాఫ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి లక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని, అటువంటి వారికి రూ.లక్ష జరిమానాతో పాటు రెండేళ్లు జైలు శిక్ష ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నళిని, నిర్మల, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పోరాటయోధులను నిర్బంధించడం నిరంకుశత్వమే

- అణచివేత ధోరణిని ప్రభుత్వం మానుకోవాలి
- నిరసన రాజ్యాంగం కల్పించిన హక్కు
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి ఉలవల భూషణం



పిఠాపురం: ప్రజల పక్షాన పోరాడే నాయకులను నిర్బంధించడం నిరంకుశమని, వారిని అణచివేసే ధోరణిని కూటమి ప్రభుత్వం మానుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి ఉలవల భూషణం అన్నారు. ఆయన ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజమహేంద్రవరం పేపర్ మిల్లు కార్మికుల సమస్యలపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆమరణ నిరాహారదీక్ష చేయడానికి సిద్ధమవుతున్న తరుణంలో హౌస్ అరెస్టు చేయడం దారుణమన్నారు. జక్కంపూడి రాజాతో పాటు మరో 50 మందిని ముందస్తు అరెస్టులు చేయడం ప్రభుత్వ దిక్కుమాలిన చర్యగా భావిస్తున్నామని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేయడం, పోరాటం చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఈ హక్కుల్ని కాల రాస్తున్న కూటమి ప్రభుత్వం విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరించి కనీసం నిరసన తెలియజేసేందుకు కూడా అనుమతించకపోవడం దారుణం అన్నారు. ప్రజలందరూ ఈ అరాచక పాలనను గమనిస్తున్నారని నిరంకుశత్వంతో లా అండ్ ఆర్డర్‌ను నియంత్రించి దారుణంగా వ్యవహరిస్తున్నారని కూటమి ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా అక్రమ కేసులు పెట్టినా ప్రజల తరపున వైఎస్సార్ సీపీ ఎప్పుడు పోరాడుతూనే ఉంటుందని ఆయన అన్నారు.

వ్యభిచార గృహం నిర్వాహకురాలిని అరెస్టు చేయాలి

ఎస్పీని కలిసిన ఐద్వా, మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులు



భారతిని అరెస్టు చేయాలంటూ ఎస్పీని కలిసిన ఐద్వా, మహిళా సంఘాల ఐక్య వేదిక నాయకులు

కాకినాడ సిటీ: పెద్దాపురంలో వ్యభిచార గృహం నిర్వహిస్తూ బాలికలను, మహిళలను ట్రాప్ చేసి ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి వారిని బలవంతంగా వ్యభిచారంలోకి దింపుతున్న భారతి అనే మహిళపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సీహెచ్ రమణి జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ను కలసి కోరారు. మంగళవారం మహిళా సంఘాల ఐక్యవేదిక సభ్యులు ఆయనను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. వీటిపై ఎస్పీ స్పందించి విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని, బాధితులకు నష్ట పరిహారం, పునరావాసంపై కలెక్టర్‌కు లేఖ రాస్తామని హామీ ఇచ్చినట్లు ఐద్వా కార్యదర్శి రమణి వివరించారు. భారతి తనను నిర్బంధించి తన బిడ్డను కిడ్నాప్ చేసి తనతో బలవంతంగా వ్యభిచారం చేయించిందని అందిన ఫిర్యాదుపై తక్షణమే కేసుపెట్టి భారతిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఆమెకు సహకరించిన పోలీసులను వెంటనే విధుల నుంచి తొలగించి వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలన్నారు. బాధితురాలికి తగిన రక్షణ కల్పించాలని ఐక్యవేదిక నాయకులు కోరారు. బాధిత మహిళకు పునరావాసం కల్పించాలని కోరినట్లు రమణి తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో ఐక్యవేదిక నాయకులు మంగాదేవి, వెంకటలక్ష్మి, ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు జి.భూలక్ష్మి ఉన్నారు.

బాలల అక్రమ రవాణా నియంత్రణకు సహకరించాలి



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో బాలల అక్రమ రవాణా నియంత్రణపై సిబ్బంది ర్యాలీ

సామర్లకోట: బాలల అక్రమ రవాణా నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక రైల్వే స్టేషన్ మాస్టర్ శ్రీదేవి అన్నారు. మంగళవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అలెర్ట్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైళ్లు, బస్సులు, లారీలు, కార్లలో బాలలను తరలించే సమయంలో ఎటువంటి అనుమానాలున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు. ఆర్‌పీఎఫ్ ఏఎస్సై విశ్వనాథ్ మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా జరిగే విధానాన్ని వివరించారు. ప్రయాణికులు పిల్లల అక్రమ రవాణాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మానవ అక్రమ రవాణా సంఘటనలు గుర్తిసే ఆర్పీఎఫ్ సిబ్బందికి, లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు రైల్వే స్టేషన్ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఆర్పీఎఫ్ ఏఎస్సై వరప్రసాద్, అలెర్ట్ ఎన్జీఓ స్టేట్ కో ఆర్డినేటర్ శీలా శ్రీను, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కో ఆర్డినేటర్ బి.నాగార్జున, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి, ఆర్పీఎఫ్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ

కాకినాడ రూరల్: లయన్స్ క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో రమణయ్యపేట మార్కెట్ వద్ద వీధి వ్యాపారులకు మంగళవారం గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ నాయకుడు డేగల రమేష్ మాట్లాడుతూ తమ క్లబ్ స్థాపించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా డైమండ్ జుబ్లీ ఉత్సవాలు నిర్వహించామన్నారు. దీనిలో భాగంగా వీధి వ్యాపారులకు ఎండ, వానల నుంచి రక్షణ కల్పించేందుకు గొడుగులు సమకూర్చామన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, చింతపల్లి సుబ్బారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నాడు ఊరించి.. నేడు వంచించి..

- నెక్సెస్ కాని సూపర్ సిక్స్ హామీలు
- నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- వేలాది మంది ఎదురుచూపులు
- నమ్మించి మోసం చేశారంటున్న యువత



కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు (ఫైల్)



ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ సంఘం

బాలాజీచెరువు: రాష్ట్రంలో ఎలాగైనా గద్దెనెక్కాలనే ఉద్దేశంతో ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన ఉమ్మడి మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలని ఊదరగొట్టారు. తల్లికి వందనం అంటూ ఏడాదిగా ఊరించి కొద్ది మందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. అలాగే వేలాది నిరుద్యోగులకు ఇస్తానన్న భృతిపై నోరు ఎత్తడం లేదు. నిరుద్యోగులకు పెద్దపీట వేస్తున్నామంటూ ప్రకటించి వారికి ఉద్యోగం వచ్చే వరకూ ప్రతి నెలా రూ.3 వేలు భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా ఇప్పటికీ దాని ప్రస్తావన తేవడం లేదు. మెగా డీఎస్సీ పేరుతో ప్రకటన చేసి కొద్ది కొన్ని పోస్టులు మాత్రమే ప్రకటించారు. పదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్, డిగ్రీ పూర్తిచేసిన వారు నగర వ్యాప్తంగా 5,33,908 మంది ఉన్నారు.

ఇంటికో ఉద్యోగం ఎక్కడ?

కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. నగర వ్యాప్తంగా 6,11,471 ఇళ్లు ఉండగా రూరల్ నియోజకవర్గంలో 16,26,389 ఇళ్లు ఉన్నాయి.

కోచింగ్ సెంటర్లకు లక్షల్లో ఫీజులు..

ప్రభుత్వ కొలువుల కోసం యువత శిక్షణ తీసుకునేందుకు లక్షల్లో ఫీజు చెల్లించాల్సి వస్తోంది. షార్ట్ టర్మ్, లాంగ్‌టర్మ్ శిక్షణకు రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకూ వసూలు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాల నోటిఫికేషన్లకు నగరంతో పాటు రూరల్ ప్రాంతంలో ప్రధానంగా 8 శిక్షణ కేంద్రాలు ఉండగా వీటిలో ఒక్కొక్క కేంద్రంలో 2 నుండి 3 వేల మంది శిక్షణ పొందుతుండగా చిన్న చిన్న శిక్షణ కేంద్రాలు మరో 20 వరకూ ఉన్నాయి.వీటిలో ఒకొక్క కేంద్రంలో వంద నుంచి 200 వరకూ శిక్షణ పొందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నిరుద్యోగులు ప్రభుత్వం ఇచ్చే నిరుద్యోగభృతి కోసం ఎదురుచూస్తున్నారు.

వయో పరిమితిపై ఆందోళన

నిరుద్యోగ భృతి అమలుకు వయో పరిమిని 22 నుంచి 35 ఏళ్లు మాత్రమే అని ప్రకటించడంతో చాలా మంది అనర్హులుగా మిగిలిపోతామని ఆందోళన చెందుతున్నారు. 22 ఏళ్లలోపు వారు ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి కోర్సులు పూర్తిచేసి ఉద్యోగాలకు శిక్షణ పొందుతారు. వీరికి నిరుద్యోగ భృతి రాకపోతే నూటికి 30 శాతం మంది అనర్హులుగా మిగిలిపోతారు.

నిరుద్యోగులకు మోసం



నిరుద్యోగ భృతి ఇస్తామన్న ప్రభుత్వం దానిపై కనీసం నేటికీ ప్రకటన చేయకపోవడం వారిని మోసం చేయడమే. వేలాది మంది విద్యావంతులు పూర్తిస్థాయి ఉద్యోగం లేక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థి, యువజన, నిరుద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఎన్నిసార్లు ధర్నాలు చేసినా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదు.

– బి.సిద్ధూ, రాష్ట్ర సహాయ కార్యదర్శి, పీడీఎస్‌యూ

విద్యార్థుల సమస్యలు తక్షణం పరిష్కరించాలి

కాకినాడ సిటీ: ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని, పీఆర్ ఒకేషనల్ కళాశాలలో అదనపు తరగతి గదులు నిర్మించాలని, అంబేద్కర్ ఎస్సీ నంబర్–1 కళాశాల వసతి గృహాన్ని తక్షణమే ప్రారంభించాలని కోరుతూ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బి సిద్ధూ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ పేద, మధ్యతరగతి విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాక వేలాది కుటుంబాలు పిల్లల చదువుల్ని నిలిపివేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రూ.6,400 కోట్లు ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని కూటమి ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అనంతరం డీఆర్వోను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు కె.నవీన్, ఎం సాయి కిరణ్, ఎం.మూర్తి, మనోహర్, పి బాలమణికంఠ తదితరులు పాల్గొన్నారు.